# కాలికాటుక

"కొన్ని విషయాలు మన కోసం విచిత్రంగా జరుగుతుంటాయా లేక కాకతీళాయమా అని అర్థం కాదు.

"నెలన్నర కిందటనుకుంటాను, సరాసరి మనింట్లోకే ఒక పావురం ఎంతో ఠీవిగా వచ్చి మన సోఫాలో మూలగా, మామూలుగా నువ్వు కూర్చునే చోటో కూర్చునేది. అది అలా కూర్చోవడం నాకు ఇష్టం ఉండేది కాదు. మొదట్లో తువ్వాలుతో అదిలిస్తే వెళ్లిపోతుండేది. నేనటు వెళ్లీ వెళ్లగానే మళ్లీ వచ్చి సోఫాలో అదే చోట కూర్చునేది. రానురాను నేనంటే భయం పోయిందనుకుంటాను, దగ్గరకు వెళ్లి తరిమితేగాని లేచి వెళ్లేది కాదు. విసుగనిపించి గది తలుపు మూసేసేవాడిని. ఇంట్లోకి రావడం మానేసింది.

"ఇహ మనింటికి అది రాదనుకున్నాను. బయట బయట తిరిగేది. రెక్కీ చేస్తున్నట్టుగా అనిపించేది. మనిల్లు వదలలేదు. ఇంట్లోకి రావడం వీలుకానందువలన వంటింటి గోడకున్న ఖాళీ పూలకుండీలో కూర్చునేది. దానికి తోడుగా మరో పావురం వచ్చేది. వాటి రావాలే ఇబ్బందిగా ఉండేవి. మనసు బావొనప్పుడు ఆ రావం భరించడం కష్టంగా ఉండేది. తొట్టె ఎత్తి పగలకొడదా మనిపించేది. తరమడానికి వెళ్లినప్పుడు, ఒకటి, మగది అనుకుంటాను–ఎగిరి ప్రహరీగోడ మీద కూర్చునేది. ఆడపావురం మటుకు, నేనెంత దగ్గిరకు వెళ్లినా అది కూర్చున్నచోట నుండి కదిలేది కాదు.

"అక్కడి నుండి దాన్ని లేపడానికిగాని, అందుకోడానికి గాని నేనెప్పుడూ ప్రయత్నం చేయలేదు. అదీ నన్ను పట్టించుకునేది కాదు. నిర్లక్ష్యంగా ఉండేది. నేనేం చేయనని భరోసా ఏమో! నిన్నంటే చేతులతో ఎత్తుకునే వాడిని. నాకంత బరువుగా నువ్వెప్పుడూ అనిపించలేదు. నిన్ను ఎత్తుకుని గిరగిరా తిప్పించుకోవడం నీకు ఇష్టం. నిన్ను సంతోషపెట్టడం నాకు ఇష్టంగా ఉండేది.

బి.పి.కరుణాకర్

"రెండు రోజుల తర్వాత గమనించాను-అది గుడ్డు పెట్టి పొదుగుతోంది. దాన్ని కదిపించడానికి, నిజం చెప్పాలంటే నాకు భయం వేసేది. నాలోని భయాన్ని ఎంచేతో ఇప్పటివరకు జయించలేకపోయాను. అలాగే ఉండిపోదామనుకుంటాను.

"మూడు వారాల తర్వాతనుకుంటాను-దాని రెక్కల చాటున చిన్ని పావురాన్ని చూశాను. నేను కిటికీలోంచి పరీక్షగా చూస్తోంటే నా వయిపు చూసేది-'నా బిడ్డను చూడు' అన్నట్లుండేయి దాని చూపులు.

"మరో వారం తర్వాత ఉదయాన్నే లేచి కిటికీ రెక్కలు తెరిచి ఖాళీ పూలకుండీ వంక చూశాను. పావురం లేదు. దాని పిల్లా కనబడలేదు. ఏ పిల్లో, కాకో పిల్లను తినేసేయేమోనని బయటకు వచ్చి చూశాను. చుట్టుపక్కల ఎక్కడా ఈకలు కనిపించకపోయే సరికి తేలికగా ఊపిరి పీల్చుకున్నాను.

"ఆ పావురం పిల్లతో వెళ్లిపోయింది-నీకు లాగా-కబడకుండా.." - ఆగి, లేచి నుంచున్నాడు.

చేతిలో ఉన్న పూలగుత్తి సమాధుల తోటలో ఉన్న తెల్లటి పాలరాతి సమాధి మీద ఉంచి, చేతులు జోడించి నమస్కారం చేస్తూ కళ్లు మూసుకున్నా అతనికి కన్నీళ్లు ఆగడం లేదు.

* రచన మాసపత్రిక, అక్టోబర్ 2011